## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు


| | | |
|---|---|---|
| 21టు 29-3-03 | | శ్రీ నాన్నగారు విశాఖపట్నంలో ఉందురు |
| 30-03-03 | ఆదివారం | భీమవరం డి.ఎన్.ఆర్ కాలేజి (మ॥ 2 గం॥ల నుండి) రామకృష్ణ ప్రార్ధనా మందిరం "శివభక్త విలాసము" - పుస్తక ఆవిష్కరణ |
| 3 టు 8-4-03 | | శ్రీ నాన్నగారు అరుణాచలంలో ఉందురు |
| 11-04-03 | శుక్రవారం | పాలకోడేరు రామాలయం శ్రీరామనవమి మహోత్సవం |
| 13-04-03 | ఆదివారం | భీమవరం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద, శ్రీ ఉద్దరాజు ఆనందరాజు గారి వర్ధంతి సందర్భముగా |

## "విశ్వాన్ని పట్టుకొంటే - విష్ణువు దొరకడు"

ఈవిశ్వం అంతా పంచభూతాలతో నిర్మితమైనది. ఆత్మలో ఈవిశ్వంకొంతే. ప్రతీజీవి, ధరించిన శరీరంకూడా పంచభూతాలకలయికతో నిర్మితమై మరణానంతరం తిరిగి అందులోనే కలిసిపోతున్నది. మానవుడు తనలోని విష్ణువును ప్రేమించటంలేదు ఎందుకంటే యీమిధ్యా ప్రపంచ వ్యామోహవస్తువుల వల్ల కలిగే లాభం ఆయన వల్ల కలగదు అని భ్రాంతి వల్ల. ఈ రోగానికి ఒక్కటే మందు "బ్రహ్మం సత్యం - జగత్తు మిధ్య". ఆడించే వాణ్ణి చూడలేక ఆడేబొమ్మలతో ఆడుకొంటున్నాము చిన్నపిల్లల్లా. "ఆత్మబుద్ధివలన నఖిలంబు తానయ్యె, జీవబుద్ధివలన జీవుడయ్యె, మోహబుద్ధి వలన ముదితలదర్శించె" అన్నారు వేమన. యీదృశ్యరూపస్వప్నంలోంచి మేలుకొనాలి అని అనుకొంటే, ధర్మజీవనంతో శారీరక భ్రాంతిని తొలగించి ఆత్మజ్ఞానజ్వాలల్లో ఇంద్రియ వ్యామోహాలను భస్మంచేసి, హృదయంలో ప్రాపంచిక భోగాలకు తావు లేకుండా చేసుకొంటూ, వివేకంగా జీవించాలి. ఈపని చెయ్యటం కష్టమే సందేహం లేదు, కాని అభ్యాస వైరాగ్యాలు సమకూర్చుకోవాలి, సద్గురు కరుణను ఆసరాగా చేసుకొని ప్రయత్నించాలి. ఇల్లు అంటుకొంటే అందుల్లోంచి బయటపడటానికి మనిషి ఎంత తపనపడతాడో అదేవిధంగా ఎవరైతే తన పాపపు తలంపుల్లోంచి బయటపడటానికి ప్రయత్నిస్తాడో, వాడు మాత్రమే అంతటా ఉన్న విష్ణువును దర్శిస్తాడు. శ్రీనాన్నగారు అంటారు. "ఒక ప్రక్క ఆత్మ మరోప్రక్క ఎంజాయ్‌మెంట్ ఉంది. మనిషి ఎన్నిజన్మలు ఎత్తినా ఒకటి చేస్తున్నాడు భోగాలు అనుభవించటం రెండవపని లేదు విషయాన్ని తెలుసుకోకపోతే మంచికి మంచి-చెడుకుచెడు అనుభవించాలి. ఈజన్మలో, మీవెంట ఉన్న భార్య-బిడ్డలు-బంధువులు-మిత్రులు అందరూ మరుజన్మలో మారిపోతారు. కాని భగవంతుడు ఒక్కడే "సత్యం" అని తెలిసే వరకూ తోడుగా వచ్చే విష్ణువును విడిచి, అనిత్యమైన మాయారూపాలను పట్టుకొని జీవితం పాడుగునా వ్రేలాడుతున్నారు. యింతకన్న మాయ ఎక్కడ ఉంది అన్నారు. మనం ఈమాయను మాయం చేయాలి అంటే మనమీద మనస్సు అధికారం చెలాయించకుండా ఎరుకకలిగి ఉండాలి-సద్గురువు పాదాలపై అచెంచలమైన విశ్వాసం కలిగిఉండాలి. ఈశ్వర కృపకు అసాధ్యమంటూ ఏదీలేదు-మనస్సు అనే మదపుటేనుగుకు ఈశ్వర కృప అంకుశం లాంటిది. "అసాధ్యంలో (మనస్సులో) అంతా సంతే - సాధ్యంలో (ఆత్మలో) అంతా సుఖమే".

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం

## శివదేవుని చిక్కాల గ్రామం శివుని విశిష్టత



శివదేవుని చిక్కాల గ్రామంలో వేంచేసియున్న శ్రీ పార్వతీ సమేత శివదేవస్వామి, అంజనేయ స్వామిచే ప్రతిష్టింపబడిన ఆలయంలో సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనములు జరిగినవి.

త్రేతాయుగంలో శ్రీరామచంద్రమూర్తి రావణాసురిని సంహరించిన పిదప మహాశివ భక్తుడయిన రావణుని చంపుటవల్ల, కలిగిన పాపం పోవుటకు శివలింగాలను ప్రతిష్టించాలని నిర్ణయించి వానర సైన్యాన్ని అన్నివైపులకూ శివలింగాలను తెమ్మని పంపుతూ తన ముఖ్య భక్తుడు అయిన ఆంజనేయస్వామిని కూడా అజ్ఞాపించాడు. శ్రీరాముని ఆజ్ఞ ప్రకారం ఆంజనేయస్వామి వారు శివలింగాన్ని కావిడిమట్టుతో తెస్తూ ప్రస్తుతం శివదేవుని చిక్కాల గ్రామంగా పిలుస్తున్న ప్రదేశానికి వచ్చేసరికి సూర్యాస్తమయం సమయం అయినది. కావిడిమట్టుతో ఆ శివలింగాన్ని అక్కడ దించి ఆంజనేయస్వామి సూర్యునికి అర్ఘ్యపాదాదులు సమర్పించుకొని మరునాటి ఉదయం శివలింగాన్ని తీయబోగా ఆ శివలింగం అక్కడ స్థాపితం అయినది. ఎంత ప్రయత్నించినా రాలేదు. ఈవిధంగా ఆంజనేయస్వామిచే ప్రతిష్టించబడిన శివలింగం చిక్కి ఉన్న మూలంగా చిక్కాల, శివదేవుని చిక్కాలగా పేరు వచ్చినది. ఈ శివదేవ స్వామిని సంతానం లేనివారు కొబ్బరి మొక్కను తీసుకు వచ్చి పూజచేయించి ఆలయ తోటలో నాటించిన వారికి తప్పక సంతానం కలుగుతుందని ప్రగాఢ విశ్వాసం. ఈ ప్రాంత వాసులకు ఉంది. దానికి అనేక నిదర్శనాలు ఉన్నాయని ఈ గ్రామ ప్రజలు ఆలయ అర్చకులు తెలిపినారు.

## జిన్నూరుపాలెంలో సద్గురు శ్రీ నాన్నగారిచే రామాలయ మందిరం శంకుస్థాపన




ది॥ 13-3-2003న జిన్నూరు గ్రామము శివారు జిన్నూరుపాలెంలో శ్రీరామాలయం మందిరం పునఃనిర్మాణానికి సద్గురు శ్రీ నాన్నగారిచే శంకుస్థాపన కార్యక్రమము జరుపబడినది. శ్రీరామాలయ మందిరం నిర్మాణ నిమిత్తం సద్గురు శ్రీ నాన్నగారు రు. 41,000/- లు భూరివిరాళము యిచ్చినారు, ఈ కార్యక్రమములో గ్రామ సర్పంచ్ శ్రీమతి కలిదిండి విజయలక్ష్మి, శ్రీ రమణ క్షేత్రం కార్యదర్శి శ్రీ పెన్మెత్స శ్రీరామరాజు, యమ్.పి.టి.సి. మెంబర్లు శ్రీమతి సిద్దాని ఇందిర, శ్రీమతి పీతాని లక్ష్మీతులసి, మాజీ సర్పంచ్ శ్రీ పాలవలస తులసీరావు, జిన్నూరు పాలెం గ్రామ పెద్దలు శ్రీ కె.వి.యల్. నరశింహారావు, కుక్కల సత్యనారాయణ మరియు ప్రముఖులు పాల్గొనడం జరిగింది.



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 13 పుష్పం : 34-36 20-3-2003

**RAMANA BHASKARA**
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 8 ISSUE : 13

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-2-2003, సఖినేటిపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం కాశీ వెళ్ళాలి అనుకొంటే ఎలా వెళ్ళాలి, ఎంత దూరం, ఎంత ఖర్చు అవుతుంది ఇవన్నీ ప్లాన్ చేసుకొని వెళతాము. ఇంతా చేస్తే 20 రోజులలో వచ్చేసేదానికి ఇంత ప్లాన్ చేసుకొంటే మరి మోక్షానికి ఇంకెంత ప్లాన్ చేసుకోవాలి? మనం దేనినైతే పొందాలి అనుకొంటున్నామో దానికి అనుగుణంగా మన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి. సూర్యుడు తూర్పున ఉంటే మన మొఖం పడమరవైపుకు పెడితే ఆయన గోచరించడు. ఏ విధంగా జీవించటం వలన మనకు మోక్షానుభవం కలుగుతుంది, దానికి మన ప్రవర్తన ఎలా ఉండాలి అని అన్నీప్లాన్ చేసుకోవాలి. ఈ దేహము నేను అనే జబ్బు ఎలాగూ వచ్చింది ఇంక భవిష్యత్‌లో జబ్బులు రాకుండా చూసుకోండి అంటే ఈ జన్మ ఎలాగూ వచ్చింది ఇంక పునర్జన్మలు రాకుండా చూసుకోండి. ఈశ్వరసంకల్పాన్ని విశ్వసించటం వలన ఈ జబ్బుతగ్గిపోతుంది. కొంతమంది పుట్టినది మొదలు ఎప్పుడు చనిపోతాము అనుకొంటూఉంటారు. భౌతికంగా అయినా, ఆధ్యాత్మికంగా అయినా ఆశావాదం ఉండాలికాని నిరాశావాదం మంచిది కాదు. మనం విశ్వాసం విడిచిపెట్టకూడదు. విశ్వాసం వలన మనస్సు కండిషన్‌లో పడిపోతుంది, కంట్రోలు వస్తుంది. మీరు ఏమైనా మాటలు శ్రవణం చేసినప్పుడు అవి మనకు ఎంతవరకు ఉపయోగపడతాయి అనే వివేకం మీకు ఉండాలి, అది లేనప్పుడు ఎంత శ్రవణం చేసినా ప్రయోజనం లేదు. కాలానికి మనస్సుకు సంబంధం ఉంది. మీరు సుఖంగా, శాంతిగా ఉంటే 24 గంటలు 24 క్షణాల క్రింద గడిచిపోతాయి. ప్రతీ విషయానికి మనస్సును పుండుచేసుకునే వారు 10 సం॥లకే 90 సం॥ల ముసలివారుగా తయారవుతారు. మేము గొప్పవారము అనుకోవద్దు, తక్కువవారము అనుకోవద్దు. మీరు అలాగ ఉండవద్దు, ఇలాగ ఉండవద్దు. మీరు ఎలాగ ఉన్నారో అలాగఉండండి అది ప్రాక్టీసుచేయాలి. ఈలోపు ఇంట్లో సమస్యలు, మనస్సులో చెడు తలంపులు వస్తూఉంటాయి. ఇంట్లోకి ఎలుకలువస్తే పోనీరానియ్యి అనుకోము ఎందుచేతనంటే అవి ఇల్లంతా పాడుచేస్తాయి. అలాగే చెడుతలంపులు వస్తే అవి నీ మనస్సును కలుషితం చేస్తాయి, అందుచేత వాటితో తాదాప్యం పొందవద్దు. ఇంటికి చుట్టం వస్తే పట్టించుకోకపోతే వాడే పోతాడు అలాగే ఈ తలంపులను పట్టించుకోకుండా ఉంటే, వాటితో తాదాప్యం పొందకుండా ఉంటే అవి ఎలా వచ్చాయో అలాగే పోతాయి. ఇంటి దగ్గర చేసేపని మనది, సమాజానికి చేసేపని మనపని కాదు అనుకొంటున్నాము. ఇదంతా మన భావనలో ఉంది. సమాజానికి చేసే పనికూడా మనదే అనుకొంటే శారీరకంగా, మానసికంగా టైర్‌అవ్వము, ఒత్తిడికి గురిఅవ్వము, అందుచేత ఆ విచక్షణను కాపాడుకోవాలి. మనం నేను నేను అనేది ఒక తలంపు. ఇది ప్రధమ తలంపు. ఇది బ్రహ్మంలోనుండి వేరుపడి ఈ దేహంతో తాదాప్యం పొందిన తరువాత ప్రపంచంతో తాదాప్యం పొందుతుంది. అక్కడ నుండి అన్నిగొడవలు ప్రారంభమవుతాయి. ఇదే ఇంజను, ఇది కదిలితే మిగతా పెట్టెలు అన్నీ కదులుతాయి. దానిని ఇతర తలంపులు నుండి వేరుచేసి ఇది ఎక్కడ నుండి వస్తోంది? దాని స్వరూపమేమిటి? అని విచారణ చేయండి. ఇది జాగ్రదవస్థలో ఉంటోంది, గాఢనిద్రలో ఉండటం లేదు. ఇదే నిజమైతే గాఢనిద్రలో కూడా ఉండాలి కదా అని మూలతలంపును పరిశీలన చేయండి. నిజమైన అందం నీహృదయంలోనే ఉంది. నేను,నాది అనేవి చెవులకు పెట్టుకొనే దుద్దులవంటివి కావు, అవి రెండూ రెండు తేళ్ళు. ఇవి మనం సుఖంగా ఉందామనుకొన్నా ఉండనివ్వవు, ఈతేళ్ళుకుడుతూ ఉంటాయి, అది వాటి స్వభావం. మీరు సాధన బాగాచేసుకోండి మంచిదేకాని ఈతేళ్ళు ఉన్నాయో లేదో చూసుకోండి. వాటిని అక్కడపెట్టుకొని నీవు ఎంతసాధన చేసినా నీకు శాంతిరాదు. అవి కుడుతూఉంటే ఏదో ఉపశమనానికి సాధనకాదు, నీ సాధన అంతా వాటిమీద గురిపెట్టు.

ఈ సంచికలో......

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


23-2-03 సఖినేటిపల్లి ....... 1
24-2-03 సఖినేటిపల్లి ....... 5
01-3-03 చించినాడ ....... 10

అవి ఉన్నంతకాలం నీకు నాన్‌సెన్స్, న్యూసెన్స్ వస్తుంది. దుద్దులను ఎప్పడైనా దొంగలు పట్టుకొనిపోవచ్చు. దుద్దులు పోయినంత తేలికగా ఈతేళ్లుపోవు. అవిఈశ్వరానుగ్రహంవలన, గురువుఅనుగ్రహం వలన పోవాలి. మిగతాతలంపుల నుండి మిధ్యానేనును వేరుచేసి దానిని చూస్తూఉంటే అదినీకు ఎదురుతిరుగుతుంది. దానికి విజృంభించటం అలవాటు. దానితోపాటు నీవుకూడా రియాక్టు అవ్వక దానిని జోకొట్టి, దానికి నచ్చచెప్పి అదిఎక్కడ నుండి ఉదయించివస్తోందో అక్కడకు దానిని పంపాలి. దానిమూలాన్ని అది చూడగానే అదినశిస్తుంది, అక్కడఉన్న బ్రహ్మమే నీకు తానుగా వ్యక్తమవుతుంది. శరీరం నిజంగా నువ్వుఅనుకో, శరీరమే నేనుఅనుకొన్నా పొరపాటులేదు. అది నువ్వు కాదు అందుచేతనే మరణంవచ్చినప్పడు అదినిన్ను వదిలేస్తోంది. ఎక్కడో మరణందాక ఎందుకు, గాఢనిద్రలోనే శరీరం నిన్ను వదిలేస్తోంది. గాఢనిద్రలో అన్నింటిలోనుండి విడిపోతున్నాము కాని మనం లేమా అంటే ఉన్నాము, అక్కడ సుఖంగా ఉన్నాము. గాఢనిద్రలో మనకు అంతసుఖం ఎక్కడనుండి వచ్చింది అంటే గాఢనిద్రలో మనం కాని దేహంలోనుండి, మనస్సులోనుండి, లోకంలో నుండి అన్నింటిలోనుండివేరుపడి పోవటం వలన అక్కడ మనంసుఖంగా ఉన్నాము. గాఢనిద్రలోనే మనస్వరూపానికి మనం దగ్గరగా ఉన్నాము. మేము జపంచేస్తున్నాము, ధ్యానంచేస్తున్నాము అంటారు గాని సత్పురుషులతో సహవాసంచేయాలి, వారి మాటలను శ్రవణం చేయాలి అనే బుద్ధిమనకు లేదు. ఏదోజపం, ధ్యానం చేస్తున్నాము అంటే ఆజపం, ధ్యానం దేనికోసం చేస్తున్నారు? అది తెలుసుకొనిచేయండి అంటున్నారు భగవాన్. లక్ష్యం లేకుండా ఏదో చేస్తున్నాము అంటే సత్ఫలితాలురావు. నీవు మనస్సును పోగొట్టుకొని అమనస్కస్థితిని పొందాలి. అందుచేత దైవందిన జీవితంలో కోపతాపాలు, ఇష్టాయిష్టాలు తగ్గించుకొని తింగరనేను యొక్కజోక్యం లేకుండా చూసుకొని నీజీవితవిధానాన్ని సరిదిద్దుకో. నేనుఅది చేసాను, ఇది సాధించాను అనుకొంటూ ఉంటే అందరూనిన్ను గౌరవించవచ్చుగాని ఇలావ్యక్తిభావనతో ఉన్నంతకాలం నీవు పైకిబాగానే ఉంటావు గాని లోపల కుళ్లిపోతావు. మనస్సు అణగటంవేరు, నశించటం వేరు. మనస్సు అణిగినప్పడు కూడా ఆనందంవస్తుంది కాని అదిటెంపరరీ. మనస్సు నశించినప్పడు నీకు పరిపూర్ణమైన ఆనందం కలుగుతుంది. మిధ్యానేను ఏవోగొడవలు కల్పించుకొంటుంది, వాటినుండి బయటకురావటానికి ఏదోసాధనలు చేయమంటుంది. బ్రహ్మంనుండి వేరుపడి దుఃఖాన్నిపోగుచేసుకొంటుంది, ఇదిబాగాలేదు సాధనచేసి ఆత్మజ్ఞానాన్ని పొందాలిఅంటుంది. ఇలాగేప్రతిజన్మలో ఏవో గొడవలు వేసుకొని గొప్పలకువెళ్లితిప్పలు తెచ్చుకొంటుంది.





లోపలదోమలకంటే బయటదోమలేమెరుగు, బయటదోమలు కొడితేపోతాయి కాని లోపలదోమలు నిరంతరం మనలను కుట్టేస్తూ ఉంటాయి. లోపల ఒకదోమ కుట్టినప్పడు భయం, ఒకదోమకుట్టినప్పడు అసూయ ఇలా ఒకోదోమకుట్టినప్పడు ఒకోరకంగా అహంకారం బయటకు వచ్చేస్తుంది. నువ్వుభగవంతుడు స్వరూపం పొందాలనుకొన్నప్పడు ఆయన ఎలా పనిచేస్తున్నాడో మనంకూడా అలాగ పనిచేయాలి. భగవంతుడు రూపరహితంగా, నామరహితంగా ఉన్నాడు, ఆయనగుర్తింపులు లేకుండా సైలెంట్‌గా పనిచేస్తున్నాడు ఎందుచేతనంటే ఆయనకు ఇతరులులేరు. జ్ఞానిఅంతా తానేఅనుకొంటాడు, అంతాతానే అనుకొన్నప్పడు ఆత్మేకనిపిస్తుంది. తనకంటే వేరుగా మంచివాడు, చెడ్డవాడు కనిపించరు. జ్ఞానిస్థితి నోటిమాటకు అందదు, అది అనుభవంలోనికి వచ్చినప్పడు మనకు తెలుస్తుంది. అశ్రుతివినకండి, శ్రుతివినండి అని వేదంచెపుతుంది. అంటే అజ్ఞానము గురించి వినవద్దు, జ్ఞానంగురించి వినండి, త్రాగటానికి కాఫీలేదని ఎదురుగాఏండ్రీను డబ్బాఉందిఅని ఏండ్రీన్ త్రాగుతారా, త్రాగరు. అలాగే జ్ఞానంగురించి వినే అవకాశం లేదు అనుకోండి అలాగని అజ్ఞానంమాటలు వినవద్దు అని వేదంచెపుతోంది. అజ్ఞానంగురించి చెప్పేవారు చెపుతారు, చెప్పటం వారితప్పకాదు వినటంనీదితప్ప. ప్రపంచం అసత్యమే అయినప్పటికీ నీకు సత్యానుభవం కలిగేవరకు, నీవుఎవరోనీవు తెలుసుకొనేవరకు అదిసత్యముగానే కనిపిస్తుంది. అన్ని యోగాల కంటె అర్థం చేసుకోవటం గొప్పయోగం. అందుకే అర్థంలేని చదువువ్యర్థం అన్నారు. ఇతరులతో ఎలామాట్లాడాలి, ఎలాప్రవర్తించాలి ఇదినేర్చుకోవటంకూడా విద్యలో ఒకభాగం. ఈవిధానం మనకు తెలియనప్పడు కాలేజీలో ఎంతచదివినా ప్రయోజనంలేదు. మీరు అన్నికోణాలలో జాగ్రత్తగా ఉండండి. మీరు ఏకోణంలో అజాగ్రత్తగా ఉన్నా దానినిమొత్తం శరీరం, మనస్సు అనుభవించాలి లోకంలోని మనుషులనుచూసి కంగారుపడవద్దు. ఈమనుషులు, జన్మలు, విరోధాలు, స్నేహాలు, బంధువులు, రాగద్వేషాలు ఇవిఅన్నీ మిధ్యానేనులోనే ఉన్నాయి. ఆనేను మీకుఅర్థమయితే ఎవరూ మీకుదుఃఖాన్ని తీసుకొనిరాలేరు, ఆనేను మీకు అర్థంకాకపోతే ఎవరైనా మిమ్మల్ని సుఖపెట్టాలన్నా సుఖపెట్టలేరు, ఆనేను ఉంటేఅంతాఉంది, అదిలేకపోతే ఏదీలేదు. మనహృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు, ఆయనమనకోసం ఎదురుచూస్తున్నాడు. ఈమిధ్యానేను, బుజ్జిగాడు ఎప్పడు అర్హత సంపాదిస్తాడు అని చూస్తున్నాడు. మనకు అర్హతవస్తే లోపలకు గుంజుకొని, ఆయనలో ఐక్యంచేసుకొని, ఆయనస్వరూపాన్ని మనకు ఇవ్వటానికి ఎదురుచూస్తున్నాడు. ఒకమంచిపని మనంచేయకపోవచ్చు కాని ఎవరైనా

మంచిపనిచేస్తే అది చూసిసంతోషించే స్థాయిఅయినా మనకు ఉండాలి. నీవు సత్పురుషుడవు అవ్వనక్కరలేదు, సత్పురుషుడిని చూసి సంతోషించేస్థితి నీకు లేనప్పుడు సద్వస్తువును ఎలా పొందగలవు. ఉన్నదేదో నీహృదయంలో ఉంది. నీవుఉంది అనుకొన్నప్పుడు, లేదుఅనుకొన్నప్పుడుకూడా అది ఉంది. నీవుఎన్ని ఉపాయాలు ఆలోచించు, ఏదోమార్గంలో ప్రయాణించు, ఏదోగురువు దగ్గరట్రైనింగ్‌పొందు , అహంభావన నశించిన మరుక్షణంలో లోపలఉన్నసత్యవస్తువు నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 24-2-03, సఖినేటిపల్లి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ప్రస్తుతం మనకు జబ్బుచేసింది అనుకోండి. ఈజబ్బు తగ్గించుకోవటం మంచిదే ఈజబ్బు తగ్గించుకొన్నా మరల 10 రోజులకు కొత్తజబ్బు వచ్చేస్తే ఏమీ ప్రయోజనంలేదు. కొత్తజబ్బులు రాకుండా చూసుకోవాలి. మీరు పూజచేయవచ్చు, జపంచేయవచ్చు, ధ్యానం చేయవచ్చు. ఎన్నిచేసినా నేను అనే తలంపు, నాది అనే తలంపు ఇవి రెండూ పూర్తిగా నశించేవరకు మీకు తాత్కాలికంగా ఏదైనా ఆనందం రావచ్చు, శాంతి రావచ్చు అది నిలబడదు, మరల అశాంతివచ్చేస్తుంది. అందుచేత ఇవి రెండూ పరిష్కారం చేసుకోవాలి. నేను, నాది అనేవి రెండూ నిజంకాదు, ఇవి తలంపులే, వీటిలోనుండి విడుదల పొందటమే నీసాధన యొక్కగమ్యం. ఇవిరెండూ దేహంచుట్టూ తిరుగుతూ ఉంటాయి. నీకు గాఢనిద్రలో నేను అనే తలంపులేదు. అక్కడ చూచేవాడులేడు, చూడబడేవి లేవు. ఈచూచేవాడు ఎంత అసత్యమో చూడబడేవి కూడా అంతే అసత్యం. ఇవి సత్యం అనుకోవటం వలన నీకు తొందరపాటు వస్తోంది, ఉద్రేకపడుతున్నావు, దుఃఖానికి గురిఅవుతున్నావు. ధ్యానంచేయుటం వలన నీకు తాత్కాలికంగా ఆనందంరావచ్చు కాని ఈ నేను అనే సమస్య పరిష్కారం అయ్యేవరకు ఆనందం శాశ్వతంకాదు. అందుచేత ఈసమస్యను ఇప్పడే, ఇక్కడే పరిష్కారం చేసుకోవాలి. నేను అనేది కూడా ఒకతలంపు, అదిమూలతంపు అది వచ్చాక మిగతావన్నీ వస్తున్నాయి. ఈమూలతలంపు నీలోపల నుండేవస్తోంది. అది ఎక్కడ నుండి వస్తోంది అని దానిని విచారణ చెయ్యి. మిగతా తలంపుల నుండి ఈ మూలతలంపును వేరుచేసి, అది ఎక్కడ నుండి ఉదయిస్తోంది అని సాత్వికగుణంతో, ఓర్పుతో, నేర్పుతో, శాంతితో అన్వేషణ చేస్తూ ఉంటే అదిలోపలకు ఉపసంహారింపబడుతుంది. చీకటి అంతా ఈమూలతలంపులోనే ఉంది. నీకు ఎంత ధనంఉన్నా, విద్యఉన్నా, అధికారంఉన్నా





ఈమూలతలంపులోనుండి విడుదలపొందితే గాని నీవు చీకటిలోనుండి, అజ్ఞానంలోనుండి బయటకు రాలేవు. నేను అనే తలంపు రోజూ ఏవో గొడవలు వేసుకొని వస్తుంది. ఆగొడవలు ఎలా పరిష్కారం చేసుకోవాలి అని ఆలోచించుకొంటూ కూర్చొంటున్నాము. ఈలోపుగా దేహానికి చావువచ్చేస్తుంది. ఇంకమన ట్రైనింగ్ సున్న, మనంఫెయిల్ అయిపోతున్నాము. నేను అనే తలంపు వేసుకొని వచ్చే గొడవలనుండి తప్పకోవటానికి ఏదో కొద్దిసేపు ధ్యానం చేస్తారు అనుకోండి, శాంతిగా ఉంటుంది అనుకోండి మంచిదే కాని అది మరల కొత్తగొడవలు వేసుకొని వస్తుంది., దానికి అంతకంటే పనిలేదు. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మీకు ఒక జబ్బు వచ్చింది, తగ్గించుకోవటానికి చూస్తున్నారు, మంచిదే కాని మరల కొత్త జబ్బులు వచ్చేస్తూ ఉంటే ఎలాగ? సాధనచేసి ఒకగోతిలోనుండి బయటకు రావటం మరల ఇంకో గోతిలో పడటం ఇలా ఎన్నాళ్ళు ప్రకృత్తిలో తిరుగుతారు. నేను అనే తలంపు ఏదో గొడవలు వేసుకొని వస్తుంది, దాని గొడవలోఅది ఉంది, మనగొడవ మనం చూసుకొందాము అని దానివంక చూడటం మానేసి, దానిచుట్టూ తిరగటం మానేసి హృదయంవైపుకు చూచుకొందాము అనే బుద్ధి మనకు రావటంలేదు. దానికి పుణ్యబలం ఉండాలి, సాధనాబలం ఉండాలి. ఎప్పడూ ఈనేను తీసుకొని వచ్చేసమస్యల వంక చూడటం, ఏడవటం. ఎప్పడూ అటుచూసేబదులు మీ హృదయంలో ఒక నిజం ఉంది, దానివంక మధ్య మధ్యలో చూడండి, మీకు శాంతి దొరుకుతుంది అని చెపుతున్నారు. గాఢనిద్రలో నీకు నేను అనే తలంపు లేదు, నాది అనే తలంపులేదు కాని నీవుఉన్నావు. నేను అనే తలంపు, నాది అనే తలంపు లేకుండా నేను ఉండలేను అని నీవు అనుకొంటున్నావు అందుచేత నీకు భయంకలుగుతోంది. రాముడువచ్చి వెళ్ళిపోయాడు, కృష్ణుడు వచ్చి వెళ్ళిపోయాడు అనుకోవటం, వర్తమానకాలంలో ఉన్న మహర్షులను వదులుకోవటం, ఇదేమాయ. మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి మీరు త్రికరణశుద్ధిగా, కపటం లేకుండా అన్వేషణ చేస్తూఉంటే ఈజన్మలోనే మీరు పొందవలసింది పొందుతారు. మూలతంపుదాని మూలంలో అణగటం, అది నశించటం, అక్కడఉన్న నిజం నీకు స్వరూపంగా వ్యక్తమవ్వటం ఒకేసారి జరిగిపోతాయి.

నాహృదయంలో ఒకనిజం ఉంది. గురువు సహాయం లేకుండా, భగవంతుడి సహాయం లేకుండా, మహర్షుల సహాయం లేకుండా నా అంతట నేనే దానిని పొందటానికి ప్రయత్నం చేస్తున్నాను, సఫలం అవుతుందా అని అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీహృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవాలనే తలంపు నీకు వచ్చింది అంటే దేవుని

దయ లేకుండా ఆతలంపుకూడా నీకు రాదు అంటున్నారు. ఆత్మాన్వేషణ చేయాలనే కోరిక కలగటమే ఈశ్వరుని కృప అంటున్నారు. పిడత ఏమిచెపుతోంది. నాకు ఇప్పుడు ఆనందంగా లేదుమట్టిలో కలిసిపోతాను అంటోంది. అలా చెప్పేటప్పుడు కూడా అది మట్టిలోనే ఉంది కాని దానికి మట్టితో తాదాప్యం లేదు పిడత రూపంతో నామంతో తాదాప్యం వచ్చేసింది. అది మట్టిలోనే ఉండి మట్టిలో కలిసిపోతాను అంటోంది. మనం కూడా అంతే ఆత్మలోనే ఉండి ఆత్మను తెలుసుకోవాలి అంటున్నాము. అది మట్టిలోనే ఉండికూడా నేను మట్టిలోలేను అని పిడత అనుకొంటోంది. మనంకూడా ఆత్మలోనే ఉండి ఆత్మలో లేము అనుకొంటున్నాము అందువలననే అశాంతి వస్తోంది. ఏదోసాధనలు చేస్తున్నాము అనటంకాదు ఏమిటి మీరు చేసేసాధనలు? ముందువిషయం అర్ధంచేసుకోండి, తరువాత సాధనలు చేయవచ్చు. మట్టిలోనే ఉండి, మట్టికంటే భిన్నంగా ఉన్నాను అనే తలంపు దానికి ఎందుకు వచ్చింది? రూపంతోటి, నామంతోటి తాదాప్యం వలన అలా అనుకొంటోంది. మనం కూడా అంతే మన నామరూపాలతో తాదాప్యం వలన ఆత్మలోనే ఉండి ఆత్మలో లేము అనుకొంటున్నాము. చైతన్యం నీహృదయంలోనే ఉంది. ఇప్పుడు మనం ఆలోచిస్తున్నాము అంటే చైతన్యం యొక్క సపోర్టు వలననే ఆలోచిస్తున్నాము అయితే మన ఆలోచనలకు చైతన్యానికి సంబంధంలేదు. నావాసనను బట్టినేను ఆలోచిస్తాను, మీ వాసనను బట్టి మీరు ఆలోచిస్తారు కాని ఈ ఆలోచనలకు చైతన్యానికి సంబంధంలేదు. ఆలోచనా విధానం అనేది జీవుడికి సంబంధించినది. మీరు ఒక పనిచేసారు అనుకోండి, దానికి ఈశ్వరుడు ఫలితం వెంటనే ఇవ్వడు. ఆకర్మఫలం ఎప్పుడు మీకు అనుభవంలోనికి రావాలి, ఏజన్మలో అది మీకు ఇవ్వాలి అని నిర్ణయించే వాడు ఈశ్వరుడు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఈకర్మను అనుభవించేవాడు ఎవడు? మూలతలంపే, వాడిని దాటివెళ్లిపో. నువ్వు ఏఅనుభవంఅయితే పొందుతున్నావో ఆపొందేవాడు ఎంతనిజమో, ఆఅనుభవంకూడా అంతే నిజం. ఈరెండూ అసత్యాలే. వీటిని వదిలెయ్యి ఇక్కడే కూర్చున్నావా అసలువస్తువు నీకు దొరకదు. నేనుకర్మ అనుభవిస్తున్నాను అని అనుకొంటూ ఇక్కడేఉంటే ఇంక నీమనస్సు ఎప్పుడు లోపలకు వెళుతుంది. వారు లోపల నుండి రమ్మనిపిలుస్తున్నారు, వారి ఆహ్వానం ఎప్పుడూ ఉండనే ఉంది. నువ్వు గడపదాటి లోపలకు వెళ్లకుండా బయటనుంచున్నావు. లోపలకు వెళ్ళటానికి నీవు ప్రయత్నం చేయటంలేదు. నీవు ప్రయత్నం రవ్వంత, ముల్లంత చేస్తే సరిపోతుంది. మిగిలిన పనిఆయనే చూసుకొంటాడు. వారికి సరిగా మర్యాద చేయలేదు, వీరికి సరిగా మర్యాద చేయలేదు. వారు ఏమనుకొంటారు, వీరు ఏమనుకొంటున్నారు అనుకొనేది ఎవరు? నేను అనుకొంటోంది. ఆ నేను అణిగిపోతే వారులేరు, వీరు లేరు. ఈక్లూ అర్ధంకాకపోతే మీకు కోటిజన్మలు ఎత్తినా మోక్షంరాదు. భగవాన్ చెపుతూ ఉండేవారు మీకు ఎప్పుడైనా ఎవరిమీద అయినా కోపంవస్తే వారిమీద కోపం పెట్టుకోవద్దు., మీమీద మీరే కోపంపెట్టుకోండి, ఆదొంగనేను మీద కోపం పెట్టుకోండి. ఇతరులమీద కోపం తెచ్చుకోవటం కాదు మీకోపం మీదకోపం తెచ్చుకోండి అనేవారు. నువ్వుశాంతిలోఉండి పనిచేస్తూఉంటే, ఆనందంలోఉండి పనిచేస్తూ ఉంటే నీశరీరం తొందరగా టైర్అవ్వదు. లోపల విసుగుదల ఉన్నప్పడు, లోపల అశాంతి ఉన్నప్పడు శరీరం తొందరగా టైర్అయిపోతుంది. రెండు చేతులు కలిస్తే చప్పట్లు, రెండు మనస్సులు కలిస్తే ముచ్చట్లు. మిమ్మల్ని చూసి నామొఖం అటుపెట్టుకొంటే, నన్నుచూసి మీమొఖంఇటుపెట్టుకొంటే ఇంక ముచ్చట్లు ఏమిటి? తెలియబడేవస్తువు అదితెలియబడటానికి ఎలా సిద్దంగా ఉందో అలా దానిని తెలుసుకోవాలనే కాంక్ష నీకు ఉన్నప్పడు యూనిటీ వస్తుంది. మీమీద నాకు ఎంత ప్రేమ ఉందో, నామీద కూడా మీకు అంత ప్రేమ ఉన్నప్పడే ఆస్నేహం నిలబడుతుంది.

జ్ఞానం కలగాలంటే గురువు అవసరమా అని అడుగుతున్నారు. రమణమహర్షి గారికి కూడా బాహ్యగురువు లేకపోయినా అరుణాచలేశ్వరుడే ఆయనకు గురువు. జె.కె. గారు గురువు అవసరం లేకుండా జ్ఞానం పొందవచ్చు అనిచెప్పారు అనిఒకరు భగవాన్‌తో అంటే ఆయనకు గురువు అవసరంలేకపోవచ్చు గాని యితరులకు ఎవరికీ గురువు అవసరంలేదని ఆయన ఎలా చెప్పగలరు అన్నారు భగవాన్. అంటే గురువు యొక్క అవసరాన్ని అంగీకరిస్తున్నారు. మనం భగవంతుడిని ఆరాధించగా, ఆరాధించగా ఆయనే ఒక శరీరం ధరించి గురువు రూపంలోవస్తాడు. ఈశ్వరుడు అన్నా, గురువు అన్నా, ఆత్మ అన్నా, ఒక్కటే. గురువు అవసరమా అయితే ఎంతకాలం అవసరం అని ప్రశ్న, ఇక్కడ భగవాన్ స్పష్టంగా చెపుతున్నారు. నీలో వ్యక్తిభావన ఉన్నంతకాలం, దేహాభిమానం ఉన్నంతకాలం, దేహమే ఆత్మఅనుకొన్నంతకాలం నీకు గురువు అవసరమే. నీవు ఆత్మవే అయితే ఆత్మను తీసుకొనివచ్చి నీదేహానికి పరిమితం చేస్తున్నావు. ఆపరిమితబుద్ధిని ఊడగొట్టటానికి గురువు అవసరమే. నీకు గురువు మీద ప్రేమ కలుగుతోంది అనుకో అదికూడా ఆయన దయే. దేహబుద్ధి పోయిన మరుక్షణంలో నీవు చైతన్యస్రవంతిలో ఐక్యమవుతావు. అప్పుడు నీకు వ్యక్తిపరమైన ఆలోచన నశిస్తుంది. కొంతమంది పేచీలువస్తే వాటిని పెంచేస్తారు. కొంతమంది పేచీలు వస్తే వాటిని పెంచరు, వాటిని పరిష్కారం చేయటానికి చూస్తారు. అలా ఎవరైతే పరిష్కారం

చేస్తున్నారో వారు దేవునిదయకు పాత్రులవుతారు. ఈశ్వరునిదయకు పాత్రులేకాదు వారసులవుతారు. పిడతమట్టిలోనే ఉండి అది తెలియక మట్టికి భిన్నంగా ఉన్నాను అనుకొంటోంది. మట్టి కంటే భిన్నంగా ఉన్నాను అన్న సంగతి నిజంకాదు. అది ఒక తలంపు. ఆతలంపు పిడతకు దుఃఖాన్ని తీసుకొని వస్తోంది. ఆపిడతకథ మనకథ ఒకటే. నువ్వు ఆత్మలోనే ఉండి ఆత్మకు భిన్నంగా ఉన్నాను అనుకొంటున్నావు. గురువు చేసే సహాయం ఏమిటి అంటే నీకుఅంతర్‌దృష్టిని కలుగజేసి ఆభిన్నతలంపును, వేరుభావనను తొలగిస్తాడు. నీవు చేసే జపంవలన, ధ్యానంవలన దేహబుద్ధి తగ్గాలి. నీసాధనలవలన దేహబుద్ది పెరుగుతూ ఉంటే ఆసాధనలవలన ప్రయోజనం ఏముంది. నీవు మందులు వాడటం వలన నీరోగం తగ్గాలి అంతేగాని మందులు వాడటంవలన నీకు రోగం పెరుగుతూ ఉంటే ఆ మందులు వాడటం ఎందుకు అంటున్నారు. కొబ్బరికాయ తయారవ్వటానికి కొంతటైము పడుతుంది కాని అది పక్వానికి వచ్చినతరువాత చెట్టునుండి రాలటం కొన్నిక్షణాలలో రాలిపోతుంది. అలాగే నీసాధనకు కొంతటైము పడుతుంది. కాని లోపలఉన్న వస్తువు అనుభవంలోనికి రావటం కొన్నిక్షణాలలో జరిగిపోతుంది. భిన్నభావన నశించటం నీవు ఆనందంలో ఐక్యమవ్వటం ఇవన్నీ కొన్ని క్షణాలలో జరిగిపోతాయి. అయితే నీహృదయంలో ఉన్న నిజం దగ్గరకు వెళ్ళేవరకు కృషి విషయంలో నీకు అశ్రద్దపనికి రాదు. బట్టకు చిల్లులు పడితే ఆప్రక్కఉన్న మనుషులనుచిల్లులోనుండి కొంచెం కొంచెం చూడవచ్చు. అలాగే మూలతలంపు పూర్తిగా నశించకపోయిన అది కొంచెందారి ఇచ్చింది అనుకోండి లోపల ఉన్న వస్తువు తాలూక మాధుర్యాన్ని కొంచంరుచి చూసావు అనుకో మరల ఆఆనందాన్ని ఎప్పడు పొందుతాము, ఎప్పడు హృదయంలో మనం లయమవుతాము అని మనస్సు ఎదురుచూస్తుంది. నీకు ఆత్మజ్ఞానం కలిగినప్పడు, ఆత్మానందం నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు, నీవు ఆనందసముద్రంలో ఊగిసలాడుతున్నప్పడు దేవతలకు అధిపతి అయిన యింద్రుడుకూడా నిన్ను చూసి అసూయపడతాడు, అట్టిది జ్ఞానంయొక్క వైభవం అన్నారు ఆచార్యులవారు. మనం ఎప్పడైనా భగవాన్ దగ్గర బుడబుక్కల మాటలు మాట్లాడుతున్నాము అనుకోండి ఆయన బుడబుక్కల మాటలు అనరు, నువ్వుచెప్పేమాటలు జ్ఞానమా? అంటారు అంటే అది అజ్ఞానం అని చెప్పటం, అది వైభవం. వింటే జ్ఞానంగురించి విను. ఒకవేళ జ్ఞానం గురించి వినవు అనుకో అజ్ఞానం గురించి వినకు. ఒకమాట గుర్తుపెట్టుకోండి. లోపల ఉన్నసత్యం నీకు స్వరూపంగా వ్యక్తమయినప్పడు అంతకంటే పొందవలసింది వేరే ఉంది అనికాని, మనం సాధించవలసింది వేరేఉంది అనికాని, ఏదోవ్యాపకం పెట్టుకొందాము





అనిగాని, అలా ఉండాలి ఇలాఉండాలి అనికాని అసలు మీకు ఏమీ అనిపించదు, అట్టిది జ్ఞానం. జ్ఞానితాను ఏదో సంకల్పించి చెయ్యాలని వాడు చెయ్యడు. ఎందుచేతనంటే ఈశ్వరసంకల్పానికి భిన్నంగా జ్ఞాని ఉండడు, జ్ఞానిదేహంద్వారా పనిజరుగుతుంది. ఆఉపాధి ద్వారా జరగవలసినది ఏదో జరుగుతుంది అంతేగాని సంకల్పం ఏమీ అక్కడ ఉండదు. గురువు మనతో మాట్లాడుతూ ఉంటాడు, నవ్వుతూ ఉంటాడు, మనతో కలిసి తింటాడు కాని మనలను హృదయగుహలోనికి తీసుకొనిపోవటానికి చూస్తూఉంటాడు. ఈచూచేవాడిని, చూడబడే దానిని తప్పించి వాటిని ఓవర్‌కమ్ చేసి హృదయం యొక్క లోయలలోనికి, ఆ నగ్నసత్యం దగ్గరకు మోసుకొని పోవటానికి గురువు ప్రయత్నం చేస్తూ ఉంటాడు. ఓంకారం గురించి వేదాలు వర్ణించి చెప్పినాయి. కాని భగవాన్ ఏమంటున్నారు అంటే నీకు మూలతలంపు వచ్చాక ఓంకారం వచ్చిందా, మూలతలంపు రాకుండా ఓంకారం వచ్చిందా అంటున్నారు. మూలతలంపు వచ్చాక ఓంకారం వచ్చింది అయితే ముందు దానిని పట్టుకో. మూలతలంపును పట్టుకొని దానిని వెంటాడి దాని మూలంలోనికి వెళ్ళు అంటున్నారు భగవాన్.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 1-03-03, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడికి రూపంలేదు, నామంలేదు. కాని అవసరాన్ని బట్టి ఒకదేహం ధరించి వస్తాడు. దేహం ధరించినప్పడు కూడా నేను శరీరమాత్రుడను కాదు అని ఆయనకు తెలుస్తూ ఉంటుంది. ఈ రోజు శివరాత్రి. శివరాత్రి అంటే అవ్యక్తమైనటువంటి పరమాత్మ ఒక లింగరూపం ధరించినరోజు. లింగం అంటే గుర్తు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని గుర్తుకోసం లింగరూపం ధరించాడు. మనం దానిని పూజించి, ధ్యానించి, ఆరాధించి ఈ వ్యక్తమయిన లింగరూపం ద్వారా అవ్యక్తంలో ఐక్యమవ్వటంకోసం, మనకు సపోర్టుకోసం భగవంతుడు లింగరూపం ధరించాడు. శివుడు అంటే మంగళ ప్రదుడు, శుభాన్ని ఇచ్చేవాడు. శివస్మరణ వలన మనం పవిత్రులం అవుతాము. ఉపవాసం అంటే భగవంతుడికి దగ్గరగా ఉండమని, కాని మనం లోకానికి దగ్గరగా ఉంటున్నాము. మనకు దుఃఖం రావటానికి ఒకటే కారణం మనం లోకాన్ని భరించలేకపోతున్నాము. లోకంలో రకరకాల మనుషులు ఉంటారు. వాళ్ళందరిని ఎవరైతే సమన్వయం చేసుకోలేరో, లోకంయొక్క పోకడ ఎవరికైతే అర్థంకాదో వాడు లోకాన్ని భరించలేక దుఃఖపడతాడు. ఈశ్వరుడు అంటే ప్రభువు, నియమించేవాడు, జీవులను వారి కర్మానుసారం నియమిస్తూ

ఉంటాడు. మనం శారీరకబాధపడలేక తొందరగా చనిపోవాలనుకొన్నా ఈ ప్రాణం భయటకు వెళ్లదు. ఈ శరీరం ఎంతకాలం ఈ భూమిమీద ఉండాలో, ఎన్ని అనుభవాలు పొందాలో అంతవరకు జీవుడు ఈశరీరాన్ని అంటిపెట్టుకొని ఉండేలా చేస్తాడు, వాడు ఈశ్వరుడు. అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని శరణువేడుకో, ఆయన నిన్ను అనుగ్రహిస్తాడు. మీ ఇంట్లో ధనం ఉంటే, బంగారం ఉంటే గుప్తంగా ఉంచుకొంటారు. అవి నాకు కనబడకపోవచ్చు. అంతమాత్రం చేత మీ ఇంట్లో బంగారం లేదు అనికాదు. అలాగే భగవతుడు మనలోపల గుప్తంగా ఉన్నాడు. మీకు కనబడటం లేదు అని ఆయన లేడు అనుకోవద్దు. మీకు భౌతికసంపద ఉంటే, ఆధ్యాత్మికసంపద ఉంటే ఊరేగవద్దు. మీకు భౌతికసంపద ఉంటే ఇతరులకు సహాయం చేయండి, జ్ఞానసంపద ఉంటే ఇతరులకు అర్థమయ్యేలా బోధించండి. భగవంతుడు మీ హృదయంలో ఉన్నాడు. మీ తలంపులకు సాక్షిగా ఉన్నాడు. ఆయన సర్వసాక్షి. ఆయన మీలోపల గుప్తంగా ఉన్నాడు కాబట్టి ఆయనను తెలుసుకోవటం కష్టం. ఆయన మీకు తెలియటంలేదు కాబట్టి ఆయన లేడు అనుకోవద్దు, అలా మోసపోవద్దు. ఆయన లోపల ఉన్నాడు కాని మీకు తెలియటంలేదు అనుకోండి. మీకు తెలియనంతమాత్రంచేత లోపల బ్రహ్మపదార్థం లేదు అని కాదు. శరీరంలో ఎన్ని జబ్బులు ఉన్నాయో లోకంలో అన్ని ఆకర్షణలు ఉన్నాయి. ఈశరీరాన్ని చంపటానికి ఒక్క జబ్బు చాలు. అలాగే మనం పతనమవ్వటానికి ఒక్క ఆకర్షణ సరిపోతుంది. మహ్మద్ ప్రవక్త శరీరం విడిచిపెట్టే సమయంలో నీవు జయించావు, నీవు జయించావు అని మాటలు వినబడుతున్నాయి కాని ఆయనకు మనిషికనబడలేదు. కాని ఎవరు అంటున్నారో ప్రవక్తకు అర్థమయ్యింది. ప్రవక్త ఏమి చెప్పాడు అంటే నాకు ప్రాణంపోవటానికి ఇంకా 5 నిమిషాలు టైముఉంది. ఈ టైములో కూడా మాయలోపడవచ్చు. అందుచేత నీవు జయించావు అని ఇప్పుడు అనటం కాదు. ఈ శరీరం పోయిన తరువాత మహ్మద్ ప్రవక్త మాయను జయించాడు అని చెప్పండి అన్నాడు. శరీరం పోయే చివరిక్షణంలో కూడా మాయలో పడటానికి అవకాశం ఉంది అందుచేత బహుజాగ్రత్తగా ఉండాలి. శివుడి మెడలో పాముఉంది, విష్ణువు పాముమీద పడుకొన్నాడు అయినా వారు శాంతిగా ఉన్నారు. ప్రపంచంలో అనేకరకాల మనుషులు ఉంటారు, క్రూరత్వంకూడా చాలా ఎక్కువగా ఉంటుంది. వారి మధ్యన నీవు శాంతిగా ఉండగలగాలి.

మానవజాతిని అమితంగా ప్రేమించినవ్యక్తి బుద్ధుడు. రెండుచేతులతో పువ్వులు పట్టుకొని ఒకతను బుద్ధుడి దగ్గరకు వచ్చాడు. బుద్ధుడు అతనితో Drop It అంటున్నాడు, అంటేవదిలెయ్యి అంటున్నాడు. ఆ భక్తుడు ఎడమచేతితో పుష్పాలు ఇవ్వకూడదు అనుకొని ఎడమచేతిలో ఉన్న పుష్పాలు వదిలేసాడు బుద్ధుడు మరలా వదిలెయ్యి, వదిలెయ్యి అంటున్నాడు. అప్పడు ఆభక్తుడు కుడిచేతిలో ఉన్న పుష్పాలుకూడా వదిలేసాడు. మరల వదిలెయ్యి, వదిలెయ్యి అంటున్నాడు బుద్ధుడు. అప్పడు ఆ భక్తుడు ఇంక నాదగ్గర వదిలేయటానికి ఏమీలేదు, మీరు ఎవరిని వదలమంటున్నారు. అని అడిగాడు. ఈపుష్పాలు నేను తెచ్చాను అని ఆనేనును మోసుకొని వచ్చావు, ఆనేనును వదిలెయ్యి అన్నాడు బుద్ధుడు. అప్పడు కదా నీకు నిర్వాణసుఖం వచ్చేది, అప్పడు నీవు నిజమైన సుఖివి అవుతావు అని చెప్పాడు. లోదృష్టి కలగటం కష్టం, దానికి సహకరించే వాడే గురువు. శివరాత్రి రోజున ఉపవాసం ఉండమని చెపుతారు అంటే శివుడికి దగ్గరగా ఉండమని చెప్పటం. ఆహారం తీసుకోవద్దని చెపుతారు అంటే నోటిద్వారానే కాదు, చెడుదృశ్యం చూస్తే మనకళ్ల ద్వారా ఆచెడ్డ మనస్సులోనికి వెళ్లిపోతుంది. చెడ్డమాటవింటే అది కూడా ఆహారమే ఏఇంద్రియం ద్వారా నువ్వు తీసుకొన్నా అది ఆహారమే అని ఆచార్యులవారు చెప్పారు. అందుచేత శివరాత్రి రోజున ఏ ఆహారం తీసుకోవద్దు అని చెపుతారు. భగవంతుడు నీ హృదయంలో ఉన్నాడు. నీవు మనస్సును నియమించుకొని, ఆయన నీహృదయంలో ఎంతలోతులలో ఉన్నాడో అక్కడకు నీ మనస్సును పంపగలిగితే అది నశిస్తుంది, భగవంతుడు నీకువ్యక్తమవుతాడు. మనం దేహంతో తాదాప్యం పొందటం వలన దేహవాసన, లోకంతో తాదాప్యం పొందటంవలన లోకవాసన పెరుగుతుంది. అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని నిరంతరం స్మరించటం వలన నువ్వు పవిత్రుడవుతావు, నీకు ఏకాగ్రత కలుగుతుంది, లోచూపుకలుగుతుంది. సహృదయం, వివేకం, బుద్దిసూక్ష్మత లేకుండా ఈశ్వరదర్శనం కాదు. మనం ఏదోబాహ్యమైన ప్రక్రియల వలన మోసంచేసి భగవదనుభవం పొందలేము. జ్ఞానఫలం మోక్షం. మహావైరాగ్యంలోనుండి, వివేకంలోనుండి అదిరావలసిందే గాని అక్కడ గోడ కట్టించాము, ఇక్కడ నుయ్యి తవ్వించాము అంటే అదిరాదు. మంచిపనులు చేయండి మంచిదే దానివలన పుణ్యం వస్తుంది, అనుభవిస్తే అది పోతుంది. కాని మోక్షం అలారాదు. దానికి బుద్ధిసూక్ష్మత ఉండాలి, వివేకబలం ఉండాలి, వైరాగ్యబలం ఉండాలి, పవిత్రత ఏకాగ్రత ఉండాలి, కాంక్షరహితుడు కావాలి ఇన్ని కలిసివస్తేగాని వాడు జ్ఞానసామ్రాజ్యానికి వారసుడు కాలేడు. మనం జాగ్రత్తగా ఉండి మనస్సును సంస్కరించుకోవాలి, మనలను మనం బాగుచేసుకోవాలి. నీకు ఏబలహీనతలు ఉన్నాయో వాటిలోనుండి విడుదలపొందటానికి ప్రయత్నంచెయ్యి, నీవు కృషిచెయ్యి కృపవస్తుంది. కృషి లేకుండా కృపరాదు. వారిని వారు

బాగుచేసుకోవటానికి ఎవరైతే కృషి చేస్తున్నారో వారికి భగవంతుడు సహకారం అందిస్తాడు.

మనలోపల ఈశ్వరుడు ఉన్నాడు, ఆయన ఒక్కడే స్వతంత్రుడు. సృష్టిస్థితి లయాలకు అతీతంగా ఉన్నవాడు ఆయన ఒక్కడే. మనకు నిజమైన స్వేచ్ఛకావాలంటే మన హృదయంలో ఉన్న ఈశ్వరుడిని మనం అనుభవంలోనికి తెచ్చుకోవాలి. నువ్వు సాధనచేసి, విచారణచేసి మూలతలంపును దాని మూలమైన హృదయంలోనికి పంపితే అది నశిస్తుంది, అక్కడఉన్న భగవంతుడు నీకు వ్యక్తమవుతాడు. నీహృదయంలో ఉన్నసత్యవస్తువును, భగవంతుడిని నీకు పట్టిఇచ్చేదే ఆత్మవిద్య. భగవదనుభవం పొందేవరకు నీకు సుఖంలేదు, శాంతిలేదు, ఆనందంలేదు. ఒక్కజ్ఞానిమాత్రమే నిజమైనసుఖి. భగవంతుడు నీకుకొన్ని అనుభవాలు పంపుతాడు. కొన్ని చెడుఅనుభవాలు రావచ్చు, కొన్నిఅనుభవాలు నీకు ప్రతికూలంగా ఉండవచ్చు. మీరు మార్గంలో ఉంటే, మీరు సత్యాన్వేషకులుగా ఉంటే ఆచెడుకూడా మంచికి దారితీసే అవకాశం ఉంది. మీకు కష్టాలు వస్తాయి. ఈకష్టాలు ఏమిటి అని మీరు అనుకొంటారు. ఆకష్టం మీ మనస్సును సత్యంవైపుకు, పరమాత్మవైపుకు త్రిప్తే అవకాశం ఉంది, అది తెలియక మీరు తొందరపడతారు. భగవంతుడికి ఎవరిపట్ల పక్షపాతం లేదు. రాగంవలన, ద్వేషం వలన మనస్సు బాహ్యముఖానికి వెళుతుంది. నీమనస్సు ఎంతవరకు బాహ్యముఖానికి వెళుతుందో అంతవరకు నీకు దేహాభిమానం పెరుగుతుంది, అహంభావన పెరుగుతుంది, కటికచీకటి లోనికి వెళతావు. నీవు దారిద్ర్యం అనుభవించినా, సంపదఅనుభవించినా నీమనస్సును కండిషన్‌లో పెట్టుకో, అప్పుడు దారిద్ర్యంఏమిచేయలేదు, సంపదఏమిచేయలేదు. నీజీవితంలో వచ్చే హెచ్చుతగ్గులకు ఊగిసలాడుతూ ఉంటే నీమనస్సు కండిషన్‌లో లేదు అనిఅర్థం. మీ ఇష్టాలకు, అయిష్టాలకు, కోపతాపాలకు, లాభనష్టాలకు, మీ బాధలకు వీటన్నింటికి అతీతంగా భగవంతుడు ఉన్నాడు. ఇవిఅన్నీ మీ దేహప్రారబ్దమునుబట్టి వస్తున్నాయి, ఇది అంతాస్వప్న సమానము. వీటికి భగవంతుడికి ఎట్టిసంబంధంలేదు. మీతో మాట్లాడేవారు ఎవరైనా మాట్లాడటం లేదనుకోండి మీకు దుఃఖంవస్తోంది అనుకోండి అదిలోకవాసన. మీకు సఫరింగ్ ఎందుకు వస్తోందో ఆకారణం మీకు అర్థంఅయితే ఆదుఃఖంమీకు రాదు. మీరు చిన్నమాటను భరించలేరు, ఇంక హృదయగుహలోనికి ఎలా వెళ్లగలరు. ఆత్మను పట్టుకొని జీవిస్తే ఆత్మ తెలియబడుతుంది. ఇప్పుడు నీవు దేనిని పట్టుకొని జీవిస్తున్నావు. అహంభావనను పట్టుకొని జీవిస్తున్నావు. అహంభావనను పట్టుకొని జీవిస్తూ ఉంటే ఆత్మ ఎలా తెలియబడుతుంది అంటున్నారు భగవాన్. ఏతలంపు అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో ఆతలంపును పట్టుకొని జీవిస్తున్నావు. అలా జీవించినప్పుడు నీకు ఆత్మానుభవం ఎలాకలుగుతుంది. ఏగ్రంథంచదివితే నీకు భగవదనుభవం పొందటానికి ఉపయోగపడుతుందో ఆగ్రంథం చదువు, భగవదనుభవం పొందినవాడి మాటలు అధ్యయనం చెయ్యి అంతేగాని దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన పెంచే గ్రంథాల జోలికి వెళ్లవద్దు.

నేను ఉన్నాను, నేను ఉన్నాను అని నీవు అనుకొంటున్నావు. నిజంగా నీవులేవు, అది తెలుసుకోవటమే జ్ఞానం. లేనిదానిని లేనట్లుగా తెలుసుకోవటమే జ్ఞానం అంటున్నారు. భగవాన్. నీవు ఏదైతే నేను, నేను అంటున్నావో అది ఉంటే చీకటి, అది లేకపోతే వెలుగు. ఇది అర్థంకావటానికి గురువు యొక్క దయకావాలి. ఈసృష్టిలో అన్ని దేహాలను ధరించినవాడు భగవంతుడే, అంతేకాదు ఈదేహాలను ఆడించేవాడు ఆయనే. మిమ్మల్ని మీభర్త తిట్టాడు అంటే తిట్టించినవాడు భగవంతుడే. మీలో ఎంతకోపం ఉందో మీకు చూపించటానికి భగవంతుడు ఆయనచేత తిట్టిస్తాడు. చేసేది అంతా భగవంతుడే . మీవేదన తగ్గాలంటే, మీమనస్సు చల్లబడాలి అంటే, మీ టెన్షన్ ఆగిపోవాలంటే ఈసృష్టిలో అన్నిరూపాలలో ఉన్నవాడు భగవంతుడే అని మీకు అర్థమవ్వాలి. అప్పుడు మనం ఎవరిని ద్వేషిస్తాము, ఎవరి మీద కోపగించుకొంటాము. సమాజంలో మంచివారు ఉంటారు, చెడ్డవారు ఉంటారు. మంచివారిని ఇంకా మంచివారుగా చేయటానికి భగవంతుడుచెడ్డవారిని ఉపయోగించుకొంటాడు, వారి పాత్రకూడా ఉంది. అన్ని దేహాలు, మనస్సులు ఆయన స్వాధీనంలో ఉన్నాయి. ఉన్నది ఆయనే. మేము ఎప్పుడు సుఖపడుతాము అని అడుగుతున్నారు. డబ్బు ఉన్నవాడికి, డబ్బులేనివాడికి, చదువుకొన్నవాడికి, చదువులేనివాడికి, ఉద్యోగస్తుడికి, ఉద్యోగం లేనివాడికి అందరికి ఇదే గోల. ఈతలంపు ఎక్కడ నుండి వస్తోంది? దేహము నేను అనే తలంపు నుండి వస్తోంది. నేను ఎప్పుడు సుఖపడతాను అని మీరు అనుకొంటూఉంటే మీకు దేహవాసన ఎక్కువగా ఉంది అని అర్థం. మీరు ఎవరిని సుఖపెడదామని, ఈశవాన్ని సుఖపెట్టాలని మీ ఉద్దేశం. ఇంకా సుఖపడాలి అనుకొంటూ ఉంటే మనకు తెలియకుండా అహంకారం యొక్క వాపు పెంచుకొంటున్నాము. ఇప్పుడు మన శవాలు చించినాడలో ఉన్నాయి. కాని మనం ఎక్కడ ఉన్నాము, బ్రహ్మంలోనే ఉన్నాము. బ్రహ్మంలోనే ఉండి బ్రహ్మంకోసం వెతుక్కొంటున్నాము. బ్రహ్మంలోనే ఉండి బ్రహ్మంకు వేరుగా ఉన్నాము అనుకొంటున్నాము. ఈచిన్నతలంపును ఓవర్‌కమ్ చేయటానికి లక్షలాది జన్మలు పట్టవచ్చు. ఈశ్వరానుగ్రహం లేకపోతే

ఈవేరుబుద్ధిలో నుండి విడుదలపొందలేము. మీరు 364 రోజులు భోగదృష్టిలో ఉన్నా, లోకానికి దగ్గరగా ఉన్నా కనీసం మహాశివరాత్రి రోజున అయినా యోగదృష్టిలో ఉండండి, శివుడికిదగ్గరగా ఉండండి. శివుడు ప్రేమస్వరూపుడు, జ్ఞానస్వరూపుడు. ఆయనకు ఏమీ అక్కరలేదు, అందరికి అన్నీ ఇస్తాడు, వాడు శివుడు. ఆయన గుప్తంగా ఉన్నాడు కాబట్టి ఆయనను తెలుసుకోవటం గహనంఅవుతోంది అంటే కష్టమవుతోంది. ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. మనకులోచూపు లేదు కాబట్టి ఆయన మనకు తెలియటంలేదు, లోచూపు ఉన్నవారికి ఆయన ఎఱుకలోనికి వస్తాడు. భగవంతుడు ఉన్నాడు, మనం లేము. ఇది మనకు అర్థంకావాలి. మనం ఏమనుకొంటున్నాము అంటే భగవంతుడులేడు, మనం ఉన్నాము అనుకొంటున్నాము. ఈ తిరకాసు ఎంతకాలం అయితే పరిష్కారం కాదో అంతకాలం మనకు పునర్జన్మలు వస్తాయి, శవాలను మోయవలసిందే.

---

**తిరువణ్ణామలై**
**17-2-2003**

పూజ్య గురుదేవా...

5 సంవత్సరముల క్రితము, నేను మొట్టమొదటిసారిగా భారతదేశము వచ్చినప్పుడు -"ఏదో ఒకరోజున గురువు యొక్క అనుగ్రహము నామీద వర్షిస్తుందని, నా స్వరూపమైన ఆత్మయొక్కఅనుభూతిని నేను పొందుతానని, 18 నెలలు ఏకాంతవాసములో ఆమధురానుభూతి నన్ను హృదయగుహలోనికి నడిపిస్తుందని" -అనిపించినది.

2003 ఫిబ్రవరి 15వ తేదీన, మౌనదీక్షలో మీరు కూర్చొని ఉన్నప్పుడు, మీ సాన్నిధ్యములో కూర్చున్న నాకు -"బోద్దిసన్! ఇప్పుడు నీవు పక్కానికి వచ్చావు. నీ స్వప్రయత్నము ఎంతదూరమైతే నిన్ను తీసుకువెళ్ళగలదో - అంతదూరము తీసుకువెళ్ళినది. ఇక మీదట గురువుపట్ల నీకుఉన్న విశ్వాసము, ధృడమైన నమ్మకమే మిగిలిన ప్రయాణము పూర్తిచేసి, నిన్ను గమ్యము చేరుస్తుంది." అన్న మీ సందేశము నాకు వినిపించింది.

"వెతకండి - దొరుకుతుంది, తట్టండి - తలుపు తెరువబడుతుంది, అడగండి - అది మీకు ఇవ్వబడుతుంది." -అని జీసస్ చెప్పాడు. ఇన్నాళ్ళు శ్రవణము చేస్తూ వెదికాను, మననము చేస్తూ తడుతున్నాను ఇక యిప్పుడు నిధిధ్యాస నాకు కుదిరి, అది నన్ను గమ్యము



4A

చేర్చుటకు - నాస్వరూపమైన ఆత్మయొక్క అనుభూతిని గురుదేవులైన మీరు నాకు అనుగ్రహిస్తారని విశ్వసిస్తున్నాను.

ప్రియతమ గురుదేవా! నా మనస్సు అంతర్ముఖమై, ఆత్మనిష్టకుదిరి, సహజసమాధిలో స్థిరపడుటకు - నాకు ఆచైతన్య స్పర్శను ప్రసాదించమని మిమ్ము ప్రార్థిస్తున్నాను. ఏప్రియల్ నెలలో నేను హవాయ్ వెళ్ళినప్పుడు - ఆ మహాద్భాగ్యాన్ని నాకు అనుగ్రహించి, నన్ను హృదయగుహను చేర్చి, ఆ చైతన్యస్రవంతిలో నన్ను మిళితము చేయమని వేడుకుంటున్నాను.

ఒకవేళ నేను పక్కానికి రాకపోతే - రెండు రోజుల క్రితము మీ మౌనసాన్నిధ్యములో నాకు వినిపించిన మీ మాటలు కేవలము నా భ్రాంతే గనుక అయితే - దయఉంచి నేను ఇంకా పక్కానికి రాలేదని చెప్పండి. ఇంకా ఏవిధముగా నేను ఎక్కువ సాధన చేయాలో చెప్పండి. "నేను ప్రయత్నము చేయాలి" అనే తలంపు కూడా లేనటువంటి సహజసాధన జరిగే శక్తిని నేనెట్లు పొందగలనో అనుగ్రహించండి.

లేదా, నేను పక్కానికి వచ్చి ఉన్నట్లయితే - మీ మౌనసందేశాన్ని నిజము చేయండి. ప్రయత్నముతో నిమిత్తములేని సహజసాధనకు నాకు దారిచూపండి. ఏప్రియల్‌లో, హవాయ్‌లో జరిగే సమావేశములో, ఏచైతన్యస్పర్శ కోసమైతే నేను పరితపిస్తున్నానో - ఆ స్థితిని నాకు ప్రసాదించండి. అలా వీలు పడకపోతే, కనీసము ఇంకా నేను ఆమధురానుభూతి కోసము ఎంతకాలము వేచియుండాలో నాకు ఆర్థమయ్యేటట్లు అనుగ్రహించండి.

రమణమహర్షిలా, అరుణాచలేశ్వరుడిలా, ఆత్మస్వరూపులై, దేహము ధరించియున్న ఓ నా ప్రియతమ గురుదేవా! మీరు నా హృదయవాసియై, నన్నీస్థితికి నడిపించి, ఊహలకే అతీతమైన అపురూపమైన కోరికను కోరేశక్తిని నాకు ప్రసాదించారు. నాకు ఆత్మయొక్క అనుభూతిని అనుగ్రహించి, నా అహంకారాన్ని హరించి, ఈ దేహము ద్వారా ఆ చైతన్యము పనిచేసేటట్లు కరుణించమని, ఆత్మనిష్టలో నేను జీవించేటట్లు అనుగ్రహించమని మిమ్ములను వినయముతో వేడుకుంటున్నాను.

వినయ విధేయభక్తి శ్రద్ధలతో ప్రార్థిస్తూ

మీ
**బోదిసన్**

(అనువాదము - డా॥ కె. రామారావు)